క్లుప్తంగా

అలుగులు పారుతున్న చెరువుల, కుంటలు

మక్తల్: మక్తల్ పట్టణంలో నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కుస్తున్న వర్షాలకు పలు వీధులు జలమయం అయ్యాయి. అంబేడ్కర్ నగర్, శ్రీరామ్‌నగర్, యల్లమ్మకుంట జలమయంగా మారాయి. మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్ కాలనీల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించారు. మండంలోని కర్ణాటక ఇడ్లూర్ వాగు నుంచి నీటి ప్రవాహం అధికంగా రావడంతో సంగంబండ రిజర్వాయర్ నీటి మట్టం నిండుకుండలా మారింది. రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరగడంతో మాద్వార్ చెరువు కట్ట వరకు బ్యాకువాటర్ వచ్చింది. నేరడుగోమ్ దగ్గర వాగు పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంగంబండ రిజర్వాయర్‌ను అధికారులు ఈఈ శివప్రసాద్, డీఈ సురేష్‌లు సందర్శించారు. దాదాపు మూడు రోజుల నుంచి సంగంబండ రిజర్వాయర్ 4 నాలుగుగేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. గ్రామాల్లో చెరువులు ఏకదాటిగా అలుగు పారుతున్నాయి. మక్తల్ చెరువుకు నీరు అధికంగా చేరింది.

బఫర్ జోన్ కాల్వల సర్వే



మరికల్: భారీ వర్షాలతో పెద్ద చెరువు నిండి అలుగు పారుతుండడంతో జాతీయ రహదారిపై నీరు చేరడంతో సోమవారం ఇరిగేషన్ డీఈఈ కిశోర్‌కుమార్ ఆక్రమణకు గురైన బఫర్ జోన్ కాల్వల సర్వే చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత నక్ష ప్రకారం మరికల్ పెద్ద చెరువు కింద బఫర్‌జోన్ ఆక్రమణకు గురికావడంతో నీరు దిగువకు వెళ్లడానికి కాల్వ లేదన్నారు. చెరువు చుట్టూ సర్వే చేసి గొలుసు కట్టు కాల్వలను గుర్తించి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు.

వర్షాల నుంచి పంటలను రక్షించుకోవాలి

దామరగిద్ద: అధిక వర్షాల వల్ల పత్తి, వరి, కంది తదితర పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, రైతులు పంటలను రక్షించుకునేందుకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి హరిత ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో దాదాపు 200 ఎకరాల్లో వరిపంట నీట మునిగిందని పేర్కొన్నారు. 4 ఎకరాల్లో మినుము, 100 ఎకరాలకు పైగా కందిపంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు. రైతులు పంట పొలాల్లో నీటి నిల్వలను తొలగించాలని, ఎలాంటి తెగుళ్లు సోకిన వ్యవసాయ అధికారులను సంప్రదించి తగిన సలహాలు సూచనలు తీసుకోవాలని కోరారు.

సాయిబన్న సేవలు మరువలేనివి

నారాయణపేట రూరల్ : నారాయణపేట మున్సిపాలిటీ మాజీ చైర్మన్ గద్దం సాయిబన్న సేవలు మరువలేనివి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రఘువీర్ యాదవ్ అన్నారు. సాయిబన్న వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

పరిసరాల శుభ్రతే ముఖ్యం

ఊట్కూరు: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే దోమల వ్యాప్తి పెరిగి విష జ్వరాలు వస్తాయని డా.భవాని ప్రజలకు సూచించారు. పగిడిమారిలో రెండు రోజుల క్రితం నేహర్‌అంజుమ్ అనే ఆరేళ్ల బాలుడికి డెంగీ సోకింది. విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది సోమవారం బాధితుడి ఇంటిని సందర్శించారు. బాధితుడి ఇంటితో పాటు చుట్టుపక్కల ఇళ్లలో దోమల నివారణ స్ప్రే చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నర్సింహులు, సుజాత, శంకర్, బుగ్గేష్, ఆకాశవాణి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



కృష్ణా: మండలంలోని కున్సి గ్రామంలో కొంత కాలంగా ఆలీసాబ్ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించిన గ్రామ యువకుడు మ్యాకలి భీమ్ సోమవారం ఒక నెలకు సరిపడ నిత్యవసర సరుకులు, 50కేజీల బియ్యం అందించాడు. ఈ సందర్భంగా ఆ యువకుడు మాట్లాడుతూ గ్రామంలోని పేద కుటుంబాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో రమేష్, మోహన్, మైబు, క్రిష్ణ పాల్గొన్నారు.

కృష్ణానదిని పరిశీలించిన తహసీల్దార్

కృష్ణా: మండల కేంద్రంలోని కృష్ణానది ఉధృతిని సోమవారం సాయంత్రం తహసీల్దార్ దయాకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడుతూ నది పెరుగుతున్నందున, నది పరిసరాల్లోకి ఎవరూ వెళ్లకూడదని, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అక్కడ పోలీసులు పహారా ఉండాలని ఆదేశించారు. స్థానిక నాయకులు, గ్రామ వీఆర్‌ఏలు ఉన్నారు.



మరికల్‌లో కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న కార్యదర్శి



మరికల్‌లో వరదలకు దెబ్బతిన్న వరిపంటను చూపిస్తున్న రైతు

తెగినరోడ్లు.. నిలిచిన రాకపోకలు

ధన్వాడ: మండలంలోని హన్మన్‌పల్లి గ్రామ శివారులో రోడ్డు తెగిపోవడంతో నాలుగు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హన్మన్‌పల్లి నుంచి చర్లపల్లి, చికర్లగడ్డ తండా, దుదుగుతండా, తోలగుట్టతండా గ్రామాలతో పాటు, వాటికి అనుబంధంగా ఉన్న మారో నాలుగు తండాకు రాకపోకలు నిలిచాయి. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నీట మునిగిన పంటలు మండలంలోని మందిపల్లి, ధన్వాడ, హన్మన్‌పల్లి, కిష్టాపూర్, యంనోనిపల్లి గ్రామాల్లో పత్తి, వరి పంటలు నీట మునిగాయి. నీరు తగ్గినా ఇసుక మేటలు చేరడంతో పంటనష్టం ఏర్పడిందని రైతులు వాపోయారు.

వర్షానికి కూలిన ఇళ్లు

మాగనూర్: మండలంలోని గురువలింగంపల్లికి చెందిన ఈడిగి సత్యమ్మ ఇళ్లు వర్షాలకు మంగళవారం తెల్లవారుజామున కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. ఇళ్లు కూలిపోయిన సత్యమ్మ కుటుంబాన్ని ఆదుకోని తక్షణ సహాయం కింద నిత్యవసర సరకులు, నగదు అందించాలని గ్రామస్తులు కోరారు.



హన్మన్‌పల్లి నుంచి చర్లపల్లి గ్రామానికి వెళ్లే దారిలో కొట్టుకుపోయిన బీటీ రోడ్డు

వరదలకు తెగిన కన్మనూర్ రోడ్డు



వరదలకు తెగిన కన్మనూర్ రోడ్డు

కూలిన 15 ఇళ్లు

మరికల్: మండల కేంద్రం నుంచి కన్మనూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి భారీ వరదలకు తెగిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మన్నెవాగు ఉధృతంగా వంతెన పైనుంచి పారడంతో రోడ్డుకు గండిపడి ధ్వంసమైంది. దీంతో కన్మనూర్, మరికల్ మధ్య మూడు రోజులుగా రాకపోకలు నిలిచాయి. మండల వ్యాప్తంగా 21 మట్టి ఇళ్లు కూలిపోయాయి. మరికల్‌లో మూడు ఇళ్లను ఖాళీ చేయించి ఇతర ఇళ్లకు తరలించారు. మండల వ్యాప్తంగా దాదాపు 35 ఎకరాలకు పైగా వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి.

చెరువు అలుగుపై గంగ పూజలు



ఊట్కూరు పెద్ద చెరువు అలుగుపై గంగ పూజలో పాల్గొన్న రైతులు

ఊట్కూరు: పెద్ద చెరువు అలుగుపై రైతులు సోమవారం గంగ పూజలు నిర్వహించారు. రెండు రోజుల క్రితం చెరువు అలుగు పారింది. ఆనవాయితీ ప్రకారం స్థానిక పాతపేట ఆంజనేయస్వామి దేవాలయం నుంచి నైవేద్యం తీసుకొని మేళతాళాలతో శోభాయాత్ర చేపట్టి, చెరువు అలుగుపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని గంగపూజ అనంతరం చెరువులో కలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్, రైతులు వెంకటరాములు, హనుమంతు, భగవంత్, వెంకటప్ప, ఆశన్న పాల్గొన్నారు.

ఆశావర్కర్లపై పనిభారం తగ్గించాలి



జక్లేర్‌లో రాస్తారోకో చేస్తున్న ఆశావర్కర్లు

మక్తల్: మండలంలోని జక్లేర్‌కు చెందిన ఆశావర్కర్ లక్ష్మి ఆగస్టు 21న రోజు వారి డ్యూటీ నిర్వహించి రాత్రి 11:30 గంటలకు వరకు రికార్డులు రాస్తుండగా.. ఉన్నట్లుండి కళ్లు తిరిగి పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో అక్కడే వైద్యం కోసం రూ.8 లక్షలు ఖర్చు చేశారు. అప్పటికే బాధిత కుటుంబ ఆర్థికంగా ఇబ్బందుల్లోకి చేరుకోవడంతో చేసేందేం లేక లక్ష్మిని గాంధీ ఆస్పత్రిల్లో చేర్పించారు. మూడు రోజులుగా గాంధీ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. సోమవారం తన స్వగ్రామానికి శవాన్ని తీసుకురావడంతో విషయం తెలుసుకున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోవిందురాజులతో పాటు ఆశావర్కర్లు అక్కడికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మృతి చెందిన ఆశావర్కర్ లక్ష్మి కుటుంబాన్ని ఆదుకోవాలని జక్లేర్‌లో రోడ్డుపై రాస్తారోకో చేశారు. పనిభారం అధికంగా కావడంతో విధుల్లోనే అనారోగ్యం పాలైందని ఆరోపించారు. లక్ష్మి కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కర్ని పీహెచ్‌సీ అధ్యక్షురాలు గోవిందమ్మ, ఇందిరమ్మ, అనిత, నాగమ్మ, లక్ష్మి, సుజాత, అనురాధ, యశోద పాల్గొన్నారు.



మృతి చెందిన ఆశావర్కర్ లక్ష్మి (ఫైల్)

రవాణా వ్యవస్థ పునఃప్రారంభం



బోయిన్‌పల్లిలో వర్షానికి కూలిన ఇల్లు

నారాయణపేట రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు తగ్గుముఖం పట్టాయి. వివిధ గ్రామాలకు రాకపోకలు స్తంభించిన చోట రవాణా వ్యవస్థ సోమవారం పునఃప్రారంభమైంది. జాజాపూర్ శేర్నపల్లి, అభంగాపూర్ బండగొండ, చిన్నజట్రం, బోయిన్పల్లి, కోటకొండ, తిరుమల దేవునిపల్లి గ్రామాలున్నాయి. రాకపోకలు ప్రారంభం కావడంతో ఆయా గ్రామ ప్రజలు పట్టణానికి వచ్చి నిత్యవసర వస్తువులు, కూరగాయలు కొనుగోలు చేసుకున్నారు. ఈ వర్షాలకు మండల వ్యాప్తంగా 7 ఇళ్లు పాక్షికంగా కూలినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. బోయిన్‌పల్లిలో 3, జలాల్ పూర్, కొల్లంపల్లి, అయ్యవారిపల్లి, తిరుమలాపూర్ గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ఎక్కడ కూడా ప్రాణనష్టం జరగలేదు.

ఆధ్యాత్మికతతోనే జన్మ సార్థకం



మక్తల్‌లో మల్లికార్జునస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మద్దూరులో నీలకంఠస్వామి జల్ది ఊరేగింపు

మక్తల్: ప్రతి ఒక్కరికీ ఆధ్యాతిక ధ్యాస ఉన్నప్పుడే జన్మ సార్థకమవుతుందని మల్లికార్జునస్వామి ఆలయ అర్చకుడు తిప్పయ్యస్వామి అన్నారు. శనివారం పట్టణంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో లక్షబిల్వార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మాగనూర్: అమావాస్య శ్రావణ మాసం ముగింపు సందర్భంగా మండలంలోని వడ్వాట్, మాగనూర్, వర్కూర్ తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు తులసి అర్చనలు, పంచామృత అభిషేకం నిర్వహించారు. వడ్వాట్ గ్రామంలో భక్తులకు గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సిములు, భక్తులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని పులిమామిడిగుట్టపై సోమవారం శ్రీరామలింగేశ్వరస్వామి రథోత్సవ వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రథంపై ఉత్సవ విగ్రహాన్ని ఉంచి భజనలు చేస్తూ రథాన్ని లాగారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. స్వామివారి ఉత్సవాలు వారం రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరయ్యగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఎల్లగౌడ్, రాంరెడ్డి, వీరసేవ లింగాయత్ అధ్యక్షుడు తంబలి బసవరాజు, రవి కుమార్, విజయ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నీలకంఠస్వామి ఉత్సవాలు

మద్దూరు: శ్రావణమాస చివరి సోమవారం పురస్కరించుకొని మద్దూరులో నీలకంఠస్వామి ఉత్సవాలను కురిహీణశెట్టి (జాంద్ర సంఘం) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు నీలకంఠస్వామి ఆలయం నుంచి పాతబస్టాండ్‌లోని శివాలయం వద్ద ఉన్న బావి నుంచి జల్ది ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పూజారి వాసుదేవచారి ఆధ్వర్యంలో నీలకంఠుడికి అభిషేకం, పూజలు నిర్వహించారు. సాయంత్రం పురవీధుల గుండా జాంద్రా సమాజం, భక్తులు నందికోలా, ఖడ్గాలు ఆడుతూ పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం దేవాలయంలో విశేషభజనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంజీవ్‌కుమార్, భాస్కర్, రమేష్, గోవిందు, శ్రీను, రవికుమార్, శివశంకర్, చంద్రశేఖర్, భరత్, విఠల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంగాదేవికి ఎమ్మెల్యే పూజలు

నారాయణపేట: జిల్లా కేంద్రానికి సమీపంలోని కొండారెడ్డిపల్లి చెరువు అలుగు పారడంతో సోమవారం ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికారెడ్డి చెరువును సందర్శించి గంగాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. చెరువునిండి అలుగు పారడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. చెరువు కింద ఆయకట్టు రైతులకు, చేపలు పెంపకానికి మత్స్యకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందే అనసూయ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం, మండల అధ్యక్షులు శివారెడ్డి, నాయకులు సరాఫ్ నాగరాజ్, కోనం గిరి హనుమంతు, బోయ శరణప్ప, రాజిరెడ్డి, జొన్నల సుభాష్, వెంకన్‌గౌడ్, కౌన్సిలర్ బస్సాపురం నారాయణమ్మ, పాల్గొన్నారు.

కర్రెమ్మ ఆలయంలో పూజలు



కర్రెమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని పళ్ల ఏరియాలో నూతనంగా నిర్మించిన కర్రెమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, హారతి అనంతరం నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సుజాత, కృష్ణ, ఆశప్ప, కృష్ణయ్య, లక్ష్మణ్, గజేంద్ర, రాజు, లింగరాజ్ ఉన్నారు.

పెసర కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



పెసర కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట: నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం మార్క్‌ఫెడ్ పర్యవేక్షణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పెసర కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి రైతులు పెసర పంటను తీసుకొచ్చి విక్రయించి లాభం పొందాలన్నారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలుకు రూ.8,682 కు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, పీఏసీఎస్ చైర్మన్ పి.నర్సింహారెడ్డి, డైరక్టర్ మల్లేశ్, సీఈఓ అశోక్‌కుమార్, సిబ్బంది జనార్దన్‌రెడ్డి, నర్సింహ, గోపాల్, మార్కెట్ సూపర్‌వైజర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని ఎక్కమేడ్ గ్రామంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోడ కూలి మృతిచెందిన తల్లీకూతుళ్ల కుటుంబాన్ని ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ అధికారి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం ఆయన తహసీల్దార్ అనిల్‌కుమార్‌తో కలిసి గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి, ఘటనకు గల కారణాలు తెలుసుకున్నారు. వారికి వెంటనే ఒక్కొక్కరికి రూ.5 లక్షలు, గృహలక్ష్మిలో ఇల్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం కొత్తపల్లి మండలంలో అలుగులు పారుతున్న చెరువులు, వాగులను పరిశీలించారు. మండలంలో జరిగే అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, రాజు, ఆర్‌ఐ మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అండగా ఉండాలి

ఎక్కమేడ్‌లో గోడ కూలి మృతిచెందిన హన్మమ్మ, అంజిలప్ప కుటుంబాన్ని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ బీజేపీ నాయకులతో కలిసి సోమవారం పరామర్శించారు. ఘటన వివరాలను మృతురాలి కొడుకు అంజప్పను, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లు చాలా ఉన్నాయని తెలుసుకొని నారాయణపేట కలెక్టర్, కొత్తపల్లి తహసీల్దార్లకు ఫోన్‌లో సమస్య వివరించారు. పోస్టుమార్టం రిపోర్టు అందిన వెంటనే కేంద్రం నుంచి వచ్చే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అందించే ఒక్కొక్కరికి రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేసియా త్వరగా అందేలా చూస్తానని భరోసా కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ కింద ఒక్కొక్కరికి రూ.5 లక్షల అందజేయడంతో పాటు, గృహలక్ష్మి పథకంలో ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. బీజేపీ నాయకులు నాగురావునామాజీ, ప్రతాప్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భవానీమాత ఉత్సవాలు



జల్దిబిందె ఉత్సవాల్లో భక్తులు



ప్రత్యేక భజనలు చేస్తున్న భజనమండలి సభ్యులు

దామరగిద్ద: మండలంలోని కాన్కుర్తిలో అంబభవానిమాత ఉత్సవాలు శ్రావణ అమావాస్య సందర్భంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకం, కుంకుమార్చాన, మంగళహారతి చేపట్టారు. అనంతరం జల్దిబిందె ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు, యువకులు మహిళలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జల్దిబిందె మహోత్సవం



మరికల్‌లో జల్దిబిందెను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



మాగనూర్‌లో..

మాగనూర్: మండలంలోని వర్కూర్ శివాలయంలో జల్దిబిందె మహోత్సవాన్ని సోమవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా కలిసి స్వామివారి విగ్రహాన్ని ఊరేగింపుగా పల్లకీలో తీసుకెళ్లి స్థానిక పెద్దవాగు జలాలతో అభిషేకించారు. అనంతరం వాగులో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి, జల్దిబిందెలో జలాలతో ఆలయానికి చేరుకున్నారు. ఆ నీటితో ఇళ్లలోని దేవుళ్ల పటాలకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రావణమాసం చివరి అమావాస్యకు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు.

మరికల్: మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఉత్సవాల సందర్భంగా సోమవారం జల్దిబిందె ఉరేగింపు నిర్వహించారు. భక్తులు భజనాలు చేసుకుంటూ ఆలయం వరకు చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం తెల్లవారుజామున అగ్నిగుండం ప్రవేశం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా శ్రావణమాస ముగింపు ఉత్సవాలు



బారంబాయి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బహార్ పేట నీలకంఠేశ్వర స్వామి పల్లకీసేవ

నారాయణపేట రూరల్: శివ కేశవులకు అత్యంత ప్రీతి కరమైన పవిత్ర శ్రావణమాసం ముగింపు ఉత్సవాలు కురిహిణి శెట్టి జాంద్ర సమాజం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారంబావి నీలకంఠ స్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తర నియమావళి, పుష్పాలంకరణ, నైవేద్యం, మహా మంగళహారతి అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. అంతకుముందు వినాయక, సుబ్రహ్మణ్యస్వామి మూలవిరాట్లకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రత్నబాయి, బాలరాజ్, దత్తప్ప, నర్సింహులు, చంద్రకాంత్, సాయికుమార్, ప్రశాంత్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి ఊరేగింపు

బహార్ పేట్ నీలకంఠ స్వామి దేవాలయంలో కురిహిణి శెట్టి జంద్ర సంఘం ఆధ్వర్యంలో స్వామి వారి మూలవిరాట్‌ను పల్లకీలో ఊరేగించారు. ఈకార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఉడ్మల్‌గిద్దలో లక్ష్మి ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

దామరగిద్ద: అకాల వర్షాలకు ఇల్లు కూలిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి గోపాల్ కోరారు. సోమవారం మండలంలోని ఉడ్మల్‌గిద్దలో కొత్తగా నిర్మాణంలో ఉన్న మాల లక్ష్మి ఇంటి గోడలు కూలిపోయినట్లు తెలిపారు. దామరగిద్ద, వితలాపూర్, ఆశన్‌పల్లి గ్రామాల్లో కూలిన ఇళ్లను అధికారులు పరిశీలించి తక్షణ సహాయం అందించాలన్నారు. ఇళ్లు కూలిన వారందరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అశోక్, శ్రీను. నర్సింహులు, భీంషప్ప పాల్గొన్నారు.